మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్



ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**జహీరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్‌కు జరుగనున్న ఎన్నికల ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ పాండు గురువారం సందర్శించి పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎన్నికల నామినేషన్ల స్వీకరణ సెంటర్లను సందర్శించి వివరాలను ఆర్‌డిఓ దేవుజా, మున్సిపల్ కమిషనర్ జైత్రం, తహసీల్దార్ పి.దశరథ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల పకడ్బందీగా ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

## మధ్యాహ్న భోజనం వికటించి 23 మంది విద్యార్థులకు అస్వస్థత

**నారాయణఖేడ్, జనవరి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం వికటించి 23 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని హుటాహుటిన ఖేడ్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి మెరుగైన చికిత్స నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆసుపత్రికి వెళ్లి పిల్లలను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. విద్యార్థులు అస్వస్థకుగల కారాకులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇలాంటివి మరోసారి జరగకుండాచూసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ఖేడ్‌లో నామినేషన్ల సందడి..

### రెండవ రోజు 52 నామినేషన్లు దాఖలు

**నారాయణఖేడ్, జనవరి 29 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ రెండవ రోజు జోరుగా కొనసాగిందని ఏడీఈఏ జె.జగ్జీవన్ తెలిపారు. గురువారం రెండవరోజు 52 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆయన వెల్లడించారు. 15 వార్డులకుగాను 28 తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, మొదటిరోజు 10 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలుచేయగా, రెండో రోజు భారీగా 52 నామినేషన్లు అందినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 35, బిఆర్ఎస్ నుంచి 12, బిజెపి నుంచి 2, ఏఐఎంఐఎం నుంచి 1, సీపీఐ నుంచి 1, స్వతంత్ర అభ్యర్థి 1 నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు.

### అందోలు-జోగిపేటలో 45 నామినేషన్లు...

**జోగిపేట, జనవరి 29, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ రెండోరోజు మొత్తం 45 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఇరవై వార్డులు ఉండగా గురువారం 45 నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇందులో బిజెపి నుంచి 14 మంది, కాంగ్రెస్ నుంచి 14 మంది, బిఆర్ఎస్ నుంచి 11 మంది, స్వతంత్రులు ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా బుధవారం 18 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక ఒకరోజే గడువు ఉండటంతో నామినేషన్లు వేయాలనుకున్న వారందరూ శుక్రవారం నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా, గురువారం పదవ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి బండల రమాదేవి వార్డులోని ప్రభుమందిరం వద్ద నుంచి భారీ జనసమీకరణతో, బ్యాండు మేళాలతో, డిజె సౌండ్‌సిస్టమ్‌తో పలువురు కార్యకర్తల నృత్యాలు చేసుకుంటూ ర్యాలీగా వచ్చి నామినేషన్‌ను దాఖలు చేశారు. మిగతా పార్టీల అభ్యర్థులు శుక్రవారం మూకుమ్మడిగా నామినేషన్లు వేయనున్నారు.

### గజ్వేల్‌లో 68 నామినేషన్లు....

**గజ్వేల్, జనవరి 29 (ప్రభాతవార్త):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రెండోరోజు గురువారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులకు సంబంధించి వివిధ పార్టీల అభ్యర్థులు 68 నామినేషన్లను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో సిపిఎం-1, బిజెపి-17, కాంగ్రెస్-19, బిఆర్ఎస్-19, ఇతరులు-5, స్వతంత్ర-7 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల నామినేషన్ సందర్భంగా గజ్వేల్ ఏసిపి నరసింహులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐఓసి ఆవరణ అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సందడిగా మారింది.

### హుస్నాబాద్‌లో 26 నామినేషన్లు...

**హుస్నాబాద్ రూరల్, జనవరి 28, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లో మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రెండవ రోజు కొనసాగింది. నామినేషన్ల స్వీకరణకు అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేయగా రెండవ రోజు 20 వార్డులకు 26 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ తాటి మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. నామినేషన్ వేసిన వారిలో 12వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా గోనెల మధుకర్, 15వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా మంజుల చిత్తారి, 16వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా వైద్యం కిరణ్‌ప్రసాద్, 11వ వార్డు బిఎస్‌పి అభ్యర్థిగా పచ్చిమట్ల రవీందర్, 5వ వారు భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా రాజ్‌కుమార్, 6వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా భూక్య లక్ష్మణ్‌సింగ్, 1వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా కూతాటి స్వప్న, 2వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా బూరుగు లత, 1వ వార్డ్ బిజెపి అభ్యర్థిగా తోట స్వరూప, 4వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా బూర వెంకన్న, 11వ వార్డ్ బిఆర్ఎస్ అభ్యర్థిగా సంపత్‌కుమార్, 11వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా పూదరి వరప్రసాద్, 20వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా మేకల వికాస్ యాదవ్, 19 వ వార్డ్ బిఆర్ఎస్ అభ్యర్థిగా బండి పుష్ప, 1వ వార్డ్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా భాషవేని లక్ష్మీ, 10వ వార్డ్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గడిపె శోభ, 18వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా అయిలేని అనిత, 3వ వార్డు బిజెపి అభ్యర్థిగా లక్కిరెడ్డి తిరుమల, 13వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గందె చిరంజీవి, 9వ బిజెపి అభ్యర్థిగా బత్తుల శంకర్ బాబు, 3వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా కొండ రజిత, 5వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా రాజు బొలిశెట్టి, 7వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా చిత్తారి పద్మ, 10వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థిగా సావుల మంజుల, 8వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా నెమలికొండ లత, 8వ వార్డు బిజెపి అభ్యర్థిగా వెల్పుల కళ్యాణి నామినేషన్లు సమర్పించినట్లు ఆయన వివరించారు.

### గుమ్మడిదల మున్సిపాలిటీలో 76...

**గుమ్మడిదల జనవరి 29 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రెండోరోజు నామినేషన్ దాఖలు ప్రక్రియ ఉత్సాహంగా కొనసాగింది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు సమర్పించడంతో నామినేషన్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. రెండో రోజు నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి: కాంగ్రెస్ పార్టీ నుంచి-17 మంది, బిఆర్ఎస్ పార్టీ నుంచి - 23 మంది, బీజేపీ నుంచి - 13 మంది, టిఆర్పి పార్టీ నుంచి - 1 అభ్యర్థి, స్వతంత్ర (ఇండిపెండెంట్) అభ్యర్థులు - 12 మంది మొత్తం 76 నామినేషన్లు దాఖలయ్యాయి. గుమ్మడిదల 13వ వార్డుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మూడు చింతల నరేందర్ రెడ్డి, నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు.పార్టీల శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి తమ అభ్యర్థులకు మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. పోలీసుల పర్యవేక్షణలో నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. రాబోయే రోజుల్లో మరింత సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉండటంతో గుమ్మడిదల మున్సిపాలిటీ రాజకీయంగా మరింత వేడెక్కనుంది.

### నర్సాపూర్‌లో 52 నామినేషన్లు...

**నర్సాపూర్, జనవరి 29, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియలో భాగంగా మొత్తం 52 నామినేషన్‌లు దాఖలయ్యాయని మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి తెలిపారు. మొదటిరోజు బుధవారం మూడు నామినేషన్లు దాఖలు కాగా రెండవ రోజు గురువారం 49 నామినేషన్లు దాఖలు కాగా రెండు రోజులు కలిపి మొత్తం 52 నామినేషన్లు స్వీకరించామని తెలిపారు. బిజెపి తరుపున 15 నామినేషన్లు దాఖలు కాగా టిఆర్ఎస్ పార్టీ తరుపున 11, కాంగ్రెస్ పార్టీ తరుపున 13, సిపిఎం పార్టీ తరుపున 1, ఆధార్ పార్టీ తరుపున 2, ఇండిపెండెంట్ అభ్యర్థులు 7 నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. మొదటిరోజు బుధవారం 3 మూడు నామినేషన్లలో ఆధార్‌పార్టీ 1, కాంగ్రెస్ 1, స్వతంత్రులు 1 నామినేషన్ వేశారని తెలిపారు. మూడు నామినేషన్లతో కలుపుకొని రెండు రోజుల్లో మొత్తం 52 నామినేషన్లు దాఖలు అయ్యాయని మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి తెలిపారు.

### విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి : ఎమ్మెల్సీ

**రామచంద్రాపురం, జనవరి 29, ప్రభాతవార్త:**

పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ విద్యార్థులు అస్వస్థతపై అంజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రామచంద్రాపురంలోని తన నివాసంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కలుషిత ఆహారం అందించడం దుర్మార్గమన్నారు. మధ్యాహ్న భోజ నం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే ఎలా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అనారోగ్యా లకు గురైన విద్యార్థుల భాధ్యత ఎవరిదని ఆందోళన వ్యక్తం చేశారు. మునుముందు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితువు పలికారు.

# అందోలులో ఎవరి ధీమా వారిదే!

* అధికార పార్టీకి అనుకూలం అంటూ కాంగ్రెస్ అభ్యర్థులు
* కాంగ్రెస్ వైఫల్యాలే కలిసొస్తాయంటున్న బిఆర్ఎస్
* బిజెపి ప్రభావం అంతంతమాత్రమే



**జోగిపేట, జనవరి 29, ప్రభాతవార్త:**

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇలాకాలోని ఏకైక మున్సిపాలిటీ అయిన అందోలు-జోగిపేటలో మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలనే యోచనలో ప్రధాన పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా ఆచితూచి వార్డుల వారీగా టిక్కెట్లను కేటాయిస్తున్నారు. మున్సిపాలిటీలో మొత్తం ఇరవై వార్డులు ఉండగా ఇప్పటికే ఒక వార్డు మినహా అన్ని వార్డుల్లో అభ్యర్థులు ఖరారయ్యారు. కాగా బిఆర్ఎస్ నుంచి మొదటి విడతగా 13 మంది జాబితాను విడుదల చేశారు. మిగతా వార్డుల్లో బలమైన అభ్యర్థులకోసం వెతుకుతున్నారు. లేదా అధికార పార్టీలో టికెట్లు దక్కని వారెవరైనా వస్తారేమో అనే ఉద్దేశంతో ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే కొన్ని వార్డుల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కొన్ని వార్డుల్లో ప్రచారంలో దూసుకుపోతుండగా బిఆర్ఎస్ నుంచి మాత్రం కేవలం 13వ వార్డు అభ్యర్థి పట్లూరి శివశేఖర్ మాత్రమే ప్రచారంలో ముందంజలో ఉన్నారు.మిగతా వార్డుల లో టికెట్లు ఖరారయ్యేవరకు అని ఇప్పటివరకు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇకపోతే కొంతమంది కాంగ్రెస్ నాయకులు షెడ్యూలుకు ముందే తమకు ఎట్లాగైనా టికెట్ దక్కుతుందనే నమ్మకంతో ఆయా వార్డులలో తాగునీటి సమస్య పరిష్కరించే నిమిత్తం బోర్లు వేయించారు. మరికొందరు సంక్రాంతి పండగకు స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. మరి కొందరి విషయానికి వస్తే వార్డులలో బరిలో ఉండాలనుకున్న వారు సంవత్సరకాలం నుంచే అడ్డగోలుగా ఖర్చులు చేసినప్పటికీ, రిజర్వేషన్లు అనుకూలించకపోవటంతో నిరాశకు గురికాగా, వారిలో కొందరు పక్క వార్డుల్లో నుంచి పోటీ చేసేందుకు బరిలోకి దిగుతున్నారు. ఈ పరిస్థితుల్లో దాదాపుగా ప్రధాన పార్టీల్లో టికెట్ల కేటాయింపు దాదాపుగా ఓ కొలిక్కివచ్చిన సందర్భంలో నెమ్మదిగా ప్రచారం ప్రారంభించారు. అయితే అధికారపార్టీ వారితో పోలిస్తే బిఆర్ఎస్ వెనకబడిందనే చెప్పవచ్చు. ఇకపోతే బిజెపి విషయానికి వస్తే కేవలం 3వ వార్డులో మాత్రం బిజెపి అభ్యర్థి పులుగు గోపాల్‌రావు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ఈ వార్డులో షెడ్యూలుకు ముందే రెండు బోర్లు వేయించారు. దీంతో ఆ వార్డులో అతనికి పరిస్థితి కొంత అనుకూలంగా మారినట్లు తెలుస్తుంది. మిగతా వార్డులలో బిజెపి పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదు. ఇందుకు ప్రధాన కారణం అందోలు నియోజకవర్గానికి బిజెపి ఇన్‌ఛార్జ్ ఎవరూ లేకపోవటమే. ఒక వేళ జహీరాబాద్ మాజీ పార్లమెంటుసభ్యులు బి.బి. పాటిల్ చొరవ తీసుకొని మున్సిపాలిటీలో బిజెపి అభ్యర్థులకు సహకరిస్తే ఏమైనా ఒకటి రెండు సీట్లు గెలుపొందే అవకాశం ఉంది.

### ఆర్భాటం లేకుండానే ప్రచారం...

ప్రచారం విషయానికి వస్తే టికెట్లు ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరూ అపుడే హంగూ ఆర్భాటం చేయటం లేదు. ముందస్తుగా వార్డుల వారీగా ఓటర్ల ఫోన్ నెంబర్లు సేకరించి, వారికి ఫోన్లలో అభ్యర్థిస్తున్నారు. వార్డు నుంచి తాము పోటీలో ఉంటున్నామని, తమకు ఈసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరికొందరు ఫోన్లతోపాటు పెద్దఎత్తున కార్యకర్తలు లేకుండానే ఒకరిద్దరిని వెంటేసుకొని ఉదయం, రాత్రి సమయాల్లో ముఖ్యమైన వారిని కలిసి తమకు ఈ ఎన్నికల్లో సహకరించాని కోరుతున్నారు. నామినేషన్ల పర్వం పూర్తవకుండానే ప్రచారంలో ఆర్భాటం చేస్తే ఖర్చు విచ్చలవిడిగా అవుతుందనే ఆలోచనతో ఇలా చేస్తున్నారు. ఎదుటివారి ప్రచార సరళిని నిశితంగా గమనిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. నామినేషన్లకు కేవలం ఒకరోజు మాత్రమే మిగిలి ఉండటంతో, ఆ ప్రక్రియ పూర్తయితే ప్రచారం హడావుడి పెరగనుంది.

### అభివృద్ధే అధికార పార్టీకి కలిసొస్తుందా?

అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో మంత్రి చేసిన అభివృద్ధి పనులే తమకు కలిసివస్తుందనే ఆలోచనలో అధికార కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులు ఉన్నారు. అధికార పార్టీకి స్థానిక ఎన్నికల్లో కొంత అనుకూల పరస్థితి ఉంటుందని, ప్రజలు ఎట్టైనా అధికారపార్టీవైపు మొగ్గుచూపుతారనే ఆలోచనలో ఆ పార్టీ అభ్యర్థులు ఉన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చటంతో పూర్తిగా విఫలమైన విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, తద్వారా సాధ్యమైనన్ని ఎక్కువసీట్లు గెలుపొందాలనే ప్రయత్నంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులున్నారు. ఈమేరకు ఇప్పటికే మున్సిపాలిటి పరిధిలో ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. బిజెపి మాత్రం ఇంకా టికెట్లు ఖరారు చేయలేదు.

## మార్కెట్ యార్డు అభివృద్ధికి భారీగా నిధులు

**హుస్నాబాద్ రూరల్, జనవరి 29, ప్రభాతవార్త :** మార్కెట్‌యార్డులో అభివృద్ధికి రూ.805.50 లక్షలు పరిపాలన అనుమతులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. హుస్నాబాద్ ఏఎంసి పరిధిలోని మార్కెట్‌యార్డు హుస్నాబాద్‌లోని గోడౌన్‌లు, కవర్డ్ షెడ్డులు, మార్కెట్ లోతట్టు ప్రాంతాల్లో ఉపరితల సీసీ పనుల కోసం 335.00 లక్షలు మంజూరు కాగా మార్కెట్ యార్డులో బ్యాలెన్స్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి 25.00 లక్షలు, విద్యుదీకరణకు 26.00లక్షలు, కాంపౌండ్ వాల్, ఇంటర్నల్‌బాక్స్ డ్రైన్ వెంబడి ఓపెన్ డ్రైయిన్ నిర్మాణానికి 400 లక్షలు, గోడౌన్‌లకు షెడ్డులు, పివిసి గట్టర్లు, డౌన్ స్పాట్‌లను కవర్ చేయడానికి ఎంఎస్ గట్టర్లను అందించడానికి 19.50 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హుస్నాబాద్ మార్కెట్‌యార్డుకి నిధులు రూ.8.5కోట్లు మంజూరు చేయడంపట్ల సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు స్థానిక శాసనసభ్యులు, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బండమీదిపల్లిలో వ్యక్తి దారుణ హత్య

**వెల్దుర్తి, జనవరి 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బండమీదిపల్లి గ్రామానికి చెందిన గంపల బాలేష్ హత్యకుగురైన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబం సభ్యుల కథనం ప్రకారం... మండలంలోని శంషారెడ్డిపల్లి తండా గ్రామపంచాయతీ పరిధిలోని బండమీదిపల్లి గ్రామానికి చెందిన గంపల బాలేష్(46) అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఏర్పరచుకోవడంతో కక్ష పెంచుకున్న భర్త అప్పలసాయిలు గొడ్డలితో హత్య చేశారన్నారు. అనంతరం అప్పల సాయిలు పోలీసులకు లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న తూప్రాన్ సిఐ కృష్ణ, వెల్దుర్తి, తూప్రాన్, సోంపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గురువారం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొడంతో పోలీసులను రంగంలోకి దించారు. మృతుడి భార్య మణెమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

## డివైడర్‌ను ఢీకొట్టిన లారీ..తప్పిన పెను ప్రమాదం



కొమురవెల్లి కమాన్ వద్ద డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీన

**కొండపాక, జనవరి 29, ప్రభాతవార్త :** తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై కొమురవెల్లి స్టేజి వద్ద లారీ అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి... గురువారం కరీంనగర్ నుండి హైదరాబాద్‌కు ఇనుము ముడిసరుకుతోవెళ్తున్న లారీ కొమురవెల్లి కమాన్ ఎదురుగా రాగానే అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రస్తుతం కొమురవెల్లి జాతర పండుగకు భక్తులు అధిక సంఖ్యలో ఇటు సిద్దిపేట, అటు హైదరాబాద్‌నుంచి వచ్చి బస్సుదిగి నడుచుకుంటూ ముందుకు వెళ్లి ఇతర వాహనాల్లో కొమురవెల్లి దేవాలయానికి చేరుకుంటారు. ఎప్పుడూ అక్కడ రద్దీగా ఉండేది. కాని లారీ డివైడర్‌ను ఢీకొట్టిన సమయంలో అక్కడ ఎవరులేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో 8 మందికి జరిమానా, జైలుశిక్ష

**గజ్వేల్ టౌన్, జనవరి 29 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జరిమానాతోపాటు ఇద్దరికి జైలుశిక్ష విధించడం జరిగిందని ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 8 మందిని గురువారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ జరిపి రూ.71,500 జరిమానా, ఇద్దరికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఆరుగురికి రూ.30వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**చౌటకూరు, జనవరి 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొంగలూరులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ విశ్వజన్ తెలిపారు. ఎస్ఐ విశ్వజన్ కథనం ప్రకారం... నమ్మదగి నమాచారం మేరకు గొంగ్లూర్ గ్రామ శివారులో కొందరు జూదం ఆడుతున్నట్లు తెలుసుకుని దాడి చేసి పేకాట ఆడుతున్న గొంగ్లూర్ గ్రామానికి చెందిన షేక్ గౌసొద్దిన్, కాశపాగ శ్రీకాంత్, శాగలేటి మొగులయ్య, దర్జీ విశ్వనాథం, గుట్టుమీద జలీల్, ఎండి ఖలీల్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. జూదరుల నుంచి 29,380 రూపాయలను, నాలుగు సెల్‌ఫోన్‌లను, 5 బైకులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలు

**చౌటకూరు, జనవరి 29, ప్రభాతవార్త:** మండలకేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అబేద్ హుస్సేన్(42) తీవ్ర గాయాలకు గురయ్యాడు. సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్ఆర్ వద్ద హోటల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అబేద్ హుస్సేన్ పనిలోకి వెళ్లేందుకు స్కూటీపై వెళుతుండగా సంగారెడ్డి-నాందేడ్ అకోలా 161వ జాతీయ రహదారపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 అంబులెన్స్‌లో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పుల్‌కల్ పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి సిసి కెమెరాల పుటేజీలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

## 190 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**కల్హేర్, జనవరి 29, ప్రభాతవార్త:** అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. ఎస్ఐ రవిగౌడ్ కథనం ప్రకారం... గురువారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో మండల పరిధిలోని ఫతేపూర్ గ్రామ శివారులో వంతెన వద్ద పిట్లం నుంచి వస్తున్న లారీ(ఎపి16టివై 0055)ను తనిఖీ చేయగా 190 క్వింటాళ్ల రేషన్ బియ్యంను గుర్తించామన్నారు. అదుపులోకి తీసుకున్న లారీని సివిల్ సప్లై అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ వివరించారు.



రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు

# భూతగాదాలు లేని జిల్లాగా మెదక్‌ను తీర్చిదిద్దాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ టౌన్ జనవరి 29 ప్రభాతవార్త :**

జిల్లాను భూతగాదాలులేని జిల్లాగా తీర్చిదిద్దాలని, ప్రతి భూ కమతానికి సరైన నక్షను, మ్యాప్‌ను, హద్దులను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులు నమోదు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమానికి మెదక్ మండలంలోని పైలెట్ గ్రామపంచాయతీ అయిన పాషాపూర్‌లో బుధవారం గ్రామసభ నిర్వహించారు. భూ భారతి చట్టం భూముల రీసర్వే కోసం నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యల పరిష్కారం అవుతుందని తెలిపారు. పాషాపూర్ గ్రామంలో భూభారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహించుకోవడనికి గ్రామసభ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. భూ భారతి భూముల రీసర్వే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రైతులకు పక్కాగా భూ హద్దులు, భూమి నక్ష, మ్యాప్‌లను నిర్ణయించి,





మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పటిష్టమైన భూరికార్డులను తయారు చేయడమే అని అన్నారు. ప్రతి కమతానికి రీసర్వేచేసి రైతులకు భూతగాదాలు లేకుండా చూడడమే దీని ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. డిజిటల్ సర్వేతో హద్దులు నిర్ణయించి, అక్షాంశ రేఖాంశాలతో సర్వేచేయడం జరుగుతుందని చెప్పారు. సర్వేతో భూ హద్దులు చెరిగిపోకుండా ఉంటాయని, భూమి ఆక్రమణలకు గురికాకుండా ఉంటుందని తెలిపారు. ఈ రీసర్వే అనంతరం రైతులు భూమిని ఎక్కడకు వెళ్లినా లేదా విదేశాల్లో సైతం భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు. తర్వాత రోజుల్లో ఈ గ్రామాన్ని నమూనాగా తీసుకొని జిల్లాలోని మరో 23 గ్రామాల్లో భూ భారతి భుముల రీసర్వేచేసి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. జిల్లా అదనపుకలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న భూములాన్ని రీసర్వే చేసి భూమి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్... ప్రజలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని నోటీసులు ఇచ్చిన బరాబర్ కొట్లాడతాం...
### మాజీ మంత్రి హరీష్‌రావు

**నంగునూర్, జనవరి 29, ప్రభాతవార్త :** కెసిఆర్ పాలనలో బంగారంలాంటి పంటలు పండాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మండల పరిధిలోని అక్కన్నపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సమ్మక్క, సారలమ్మ జాతరలో ఆయన పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. కెసిఆర్ పాలనలో లేని ఎరువుల కొరత రేవంత్‌రెడ్డి పాలనలో ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. కెసిఆర్ నాట్లకు నాట్లకు రైతుబంధు ఇస్తే రేవంత్‌రెడ్డి ఓట్లకు ఓట్లకు రైతుబంధు ఇస్తున్నారని తెలిపారు. ఫిబ్రవరి నెల వస్తున్న నేటికీ రైతు భరోసాకు దిక్కులేదన్నారు.ప్రశ్నిస్తే నోటీసులు పంపుతున్నారు నేడు కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని తెలిపారు. కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే సూర్యుని మీద ఉమ్మినట్లేనని తెలిపారు. ఎన్ని నోటీసులు ఇచ్చిన ఇంకా గట్టిగా బరా బర్ కొట్లాడుతామన్నారు. కరెంటు సైతం సరిగా రావడం లేదన్నారు. అమ్మవార్ల దయతో మంచి పంటలుపండి అందరూ సంతోషంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న హరీష్‌రావు

కెసిఆర్ పాలన స్వర్ణయుగం లాంటిందన్నారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట అర్బన్, జనవరి 29, ప్రభాతవార్త :**

సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె.హైమావతి గురువారం ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బిర్యానీ, అన్నం, ఆలుగడ్డ, టమాటా కూరని పరిశీలించారు.కూరలో నీటి శాతం ఎక్కువగా ఉన్నందున వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలచటి కూరలతో వంట ఇష్టానుసారంగా చేస్తే సహించేదిలేదని వంట సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థుల హాజరు ప్రకారం రోజు కొలత ప్రకారం ఆహార పదార్థాలను అందించి వంట పూర్తయ్యేదాక మానిటర్ చేయాలని టీచర్లను ఆదేశించారు. కామన్ డైట్ మెనూ పాటించాలని రుచికరమైన ఆహారం విద్యార్థులకు కడుపునిండా సరిపోయేంత అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం ప్రక్రియను పరిశీలించారు. అలాగే కెసిఆర్ నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపులే తెలంగాణ బీసీ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.



రంగధాంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, గుడ్డు, వంకాయ ఆలుగడ్డ, పప్పు, సాంబారు పెరుగు అన్నింటిని తనిఖీ చేశారు. పప్పు పలుచగా ఉండడంతో వంట సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు.

### బస్తీ దవాఖాన పరిశీలన

అనంతరం కెసిఆర్‌నగర్‌లోని బస్తీ దవాఖానను జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. హాజరు పట్టికను పరిశీలించారు.

విధులకు హాజరు కానీ వారిపై చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

## రామలింగేశ్వర ఆలయ వార్షికోత్సవం

**టేక్మాల్, జనవరి 29, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన టేక్మాల్‌లో ఉన్న శ్రీరామలింగేశ్వర ఆలయ వార్షికోత్సవం ఈ నెల 30వ తేదీన శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి నాగరాజు తెలిపారు. మెదక్‌జిల్లా టేక్మాల్‌శివారులోని రామేశ్వరగుట్టపై వెలసిన స్వామివారి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఉదయం గౌరిగణపతిపూజ, శివపంచాయతన అభిషేకం, మహారుద్రునికి రుద్రాభిషేకం, అన్నపూజ, మహాహారతి పూజా కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు. అధికసంఖ్యలో భక్తులు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు హాజరుకావాలని కోరారు. ఆమహారుద్రుని పూజాకార్యక్రమంలో పాల్గొని మహాదేవుని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించి శ్రీరామలింగేశ్వరుని కరుణాకటాక్షాలు పొందాలని పేర్కొన్నారు.

## రామాయంపేటలో రెండవరోజు 51 నామినేషన్‌లు

**-మున్సిపల్ ఎన్నికల అధికారి సాయిబాబా**



నామినేషన్ వేస్తున్న మహిళా అభ్యర్థిని

**రామాయంపేట, జనవరి 29, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రెండవరోజు గురువారం నాడు 51 నామినేషన్‌లు దాఖలైనట్లు మున్సిపల్ ఎన్నికల ప్రత్యేక అధికారి సాయిబాబా తెలిపారు. అందులో కాంగ్రెస్ 13, బిఆర్ఎస్ 10, బిజెపి 4, ఇండిపెండెంట్ 5గురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. రెండు రోజుల్లో మొత్తం 58 నామినేషన్‌లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఈనెల 30న నామినేషన్ ప్రక్రియ ముగియనుందని, చివరిరోజు మరిన్ని నామినేషన్‌లు దాఖలయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

## సర్పంచిపై విచారణ జరపాలని ఎంపిడివోకు వినతి



సర్పంచ్‌పై విచారణ జరపాలని వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

**టేక్మాల్, జనవరి 29, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండలం వెంకటాపూర్ సర్పంచి రాంబాయిపై బంజారా సేవాలాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఎంపిడివో రియాజుద్దీను గురువారం ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచి రాంబాయి బిసి మహిళగా ఉండి నకిలీ ఎస్టీ రిజర్వేషన్ పత్రాన్ని పొంది ఎస్టీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్టీ రిజర్వేషన్ పత్రంతో నాడు ఎంపిటిసిగా గెలిచి, నేడు సర్పంచిగా గెలుపొందారని అన్నారు. సర్పంచిపై, నకిలీ పత్రాలపై సమగ్ర విచారణ జరిపి ఇందుకు సహకరించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈయనవెంట గిరిజన నాయకులున్నారు.

## వార్డును మరింత అభివృద్ధిచేస్తా

**-9వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిని సునీతాబాల్‌రెడ్డి**



నామినేషన్ దాఖలుచేయడానికి వెళ్తున్న అభ్యర్థిని సునీతాబాల్‌రెడ్డి

**నర్సాపూర్, జనవరి 29, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 9 కౌన్సిలర్‌గా మళ్లీ గెలిపించినట్లైతే ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేస్తానని 9వ వార్డు కౌన్సిలర్ బిఆర్ఎస్ సునీతాబాల్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ ఎంపిడివో కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, గత మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొంది 5 సంవత్సరాలుగా 9వ వార్డుకు కౌన్సిలర్‌గా, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. కాగా మళ్లీ అవకాశం ఇస్తే మరింతగా రోడ్డు నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, సిసి రోడ్ల నిర్మాణాలు, వంటి అభివృద్ధి పనులు ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో చేస్తామన్నారు. అంతేకాకుండా 9వ వార్డు ప్రజలు అందరూ నాయకురాలిగా కాకుండా కుటుంబసభ్యులుగా భావిస్తున్నారని, అందరికీ అందుబాటులో ఉండి మళ్లీ సేవచేసే అవకాశం వచ్చినందున తనకు మళ్లీ అవకాశం ఇచ్చి తననే గెలిపిస్తారన్న ధీమాను అభ్యర్థి సునీతాబాల్‌రెడ్డి వ్యక్తంచేశారు.

## పేట మున్సిపాలిటీలో ఊపందుకున్న నామినేషన్లు

**సదాశివపేట్, జనవరి 29, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ టికెట్ రాని లతీఫ్‌కు టిఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయింపు జరిగినట్లు కొన్ని మినహా పార్టీలవారీగా అభ్యర్థుల ఖరారు అయినట్లు సమాచారం. పార్టీ గుర్తు దక్కని ఆశావహులు ఇండిపెండెంట్‌గా రంగంలోకి దిగారు. మునిసిపాలిటీ వార్డు కౌన్సిలర్‌గా నామినేషన్ వేయడానికి ఒకరోజు మాత్రమే గడువు ఉండడంతో గురువారం అభ్యర్థులు అధిక సంఖ్యలో నామినేషన్ వేశారు. అంతర్గత సమస్యల వలన టిఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ కొన్ని సీట్ల అభ్యర్థులను ఖరారు చేయకపోయినప్పటికీ అధినాయకుల సూచన మేరకు పార్టీగుర్తు వస్తుందని ఆశాభావంతో నామినేషన్లు వేశారు. చాలారోజులుగా పార్టీలో ఉన్నప్పటికీ టికెట్ రాకపోవడంతో కొందరు ఇండిపెండెంట్‌గా రంగంలోకి దిగారు. కొందరి ఒత్తిడి కారణంగా కూడా టికెట్లు కేటాయించడంతో ఆ స్థానాలలో ఆశించిన వారికి టికెట్ రాకపోవడంతో రెబల్సుగా రంగంలోకిదిగారు. దీనివలన ఊహించిన ఫలితాలు రావచ్చని మేధావులు గుసగుసలాడుతున్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపిడివో

**వెల్దుర్తి, జనవరి 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్థానిక ఎంపీడీవో ఉమాదేవి మధ్యాహ్నంభోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా భోజనంపై ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాల విద్యార్థులకు సరైన మెనూతో మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఎంపిఓ నవీన్, విజయ్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధువుకు సర్పంచ్ పుస్తెమెట్టెలు

**పుల్‌కల్, జనవరి 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన పుల్‌కల్‌లో గురువారం మహమ్మద్ యాదుల్, నాజియాబేగం దంపతుల కుమార్తె ఫాతిమాబేగంతో కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన మహమ్మద్ షఫీతో జరిగిన వివాహంలో సర్పంచి లావణ్యకృష్ణారెడ్డి వధువుకు పుస్తెమెట్టెలు బహూకరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి ప్రవీణ్, న్యాయవాది సిద్దయ్య, మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్‌చారి, మాజీసర్పంచి శ్రవణ్‌కుమార్, వార్డు సభ్యులు మహమ్మద్ అబిక్, బిఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, రాజారాం, జౌసలి లక్ష్మణ్‌చారి, మహమ్మద్ గౌసోద్దిన్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

**..కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, జనవరి 29, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం స్కూల్లో జరిగిన ఫుడ్ పాయిజన్ లో 47మంది విద్యార్థులు అస్వస్థతకు గురి అయ్యారు. నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అసమర్థ ఎంపి, ఎమ్మెల్యే నారాయణఖేడ్ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని నియోజకవర్గంలో పూటపూటకూ ప్రతీపాఠశాలలో రెసిడెన్షియల్ స్కూళ్లలో ఫుడ్ పాయిజన్ జరుగుతున్నా ఈ నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. వీళ్లకు విద్యార్థుల ప్రాణాల కంటే వాళ్ల జేబుల్లో డబ్బులు నింపుకోవడం ముఖ్యమని, గతంలో ఇదే వెంకటాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవనం పైపెచ్చు ఊడిపడి విద్యార్థులకు తీవ్ర గాయాలు అయినాయని గుర్తు చేశారు. విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి ఉండి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ పూర్తిగా విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని తెలిపారు. ఈ నియోజకవర్గంలో ఎంపి, ఎమ్మెల్యేలు ఉండి కూడా విద్యార్థుల గురించి, విద్యా వ్యవస్థ గురించి పట్టించుకున్న పాపాన పోలేదు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మనూర్ మండల పార్టీ అధ్యక్షులు విఠల్‌రావు పటేల్, సర్పంచి వెంకటేశం, మాజీ సర్పంచులు సంగప్ప, సాయిలు, రాజునాయక్, మండలపార్టీ యువత అధ్యక్షులు మచ్చేందర్ ముదిరాజ్, నాయకులు సత్యం, సాయిలు, రాములు, చింటూ నరేష్, రాములు, అంబదాస్, లక్ష్మణ్, శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

## ఎన్నికలు ప్రశాంతవాతావరణంలో నిర్వహించాలి

**-జిల్లా అదనపు ఎస్పీ మహేందర్**



నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

**నర్సాపూర్, జనవరి 29, ప్రభాతవార్త:**
ప్రస్తుతం జరుగనున్న నర్సాపూర్ మున్సిపల్ 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్‌లోని ఎంపిడివో కార్యాలయంలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను గురువారం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా అధికారుల పనితీరునుపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. జిల్లావ్యాప్తంగా జరుగనున్న అన్ని మున్సిపాలిటీల పరిధుల్లో జరిగే మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఏర్పాట్లుచేసినట్లు తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఎన్నికల అధికారులు, పోలీసుల సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, సిఐ జాన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, నర్సాపూర్ ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

**చౌటకూరు, జనవరి 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులో రైతులకు వ్యవసాయ విద్యార్థులు పంటల యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. డాట్ సెంటర్ ఆధ్వర్యంలో వ్యవసాయ విద్యార్థులు సీలం పాషా, శేక్ మహమ్మద్‌సాబ్, పవన్‌కళ్యాణ్, మానస, నవీన్‌లు గ్రామంలోని వ్యవసాయక్షేత్రాలను పరిశీలించి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై వివరించారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలను వినియోగించుకోవాలని, అడవిపందులు, కోతులబెడద లాంటి సమస్యల పరిష్కారానికి సమగ్రంగా అవగాహన కల్పించారు. రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను శాస్త్రీయంగా నమోదు చేయడంతోపాటు నివృత్తి చేశారని రైతులు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ, డాక్టర్ నిర్మల, ఆకాశ్, ఎంపిఓ సువర్ణ, రైతులు పట్నాటి మల్లికార్జున్‌గౌడ్, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నసంఘాల విధుల పుస్తక నిర్వహణపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మండల సమాఖ్య సభ్యులు తదితరులు

**నర్సాపూర్, జనవరి 29, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని మండల సమైక్య కార్యాలయంలో గురువారం మండల సమైక్య సీనియర్ సిఆర్పీలచే రెండవరోజు శిక్షణకార్యక్రమం నిర్వహించారు. నిర్వహణపై సీనియర్ సిఆర్పీలు మాట్లాడుతూ చిన్నసంఘాల్లో ముఖ్యంగా సంఘాల బలోపేతం, పుస్తక నిర్వహణ, సంఘం కట్టుబాట్లు, చిన్నసంఘాల పనితీరు గురించి వివరించారు. గ్రామ సంఘం అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి చేయవలసిన బాధ్యతలు, విధులను గురించి తెలియజేస్తూ వారు చేయవలసిన పనులు, చేయకూడని పనుల గురించి క్లుప్తంగా వివరించారు. మండల సమైక్య నిర్వహణ గురించి మండల సమైక్య విధివిధానాలను, సమయపాలన, పొదుపులు, అప్పు చెల్లింపుల గురించి వివరించడం జరిగింది. సంఘ సభ్యులకు ఇన్సూరెన్సులు, బ్యాంక్ అప్పు, శ్రీనిధి అప్పు, సిఐఎఫ్ అప్పుల గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో సిఆర్పీలు రషీదా, మీనలతోపాటు మండలంలోని అన్నిగ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, సిసిలు దేవీసింగ్, నర్సింలు, ప్రవీణ, రవీందర్, నాగరాజు, మల్లేశం, ఎపిఎం సంగమేశ్వర్ పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం

**-పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్**



విద్యార్థుల నృత్య ప్రదర్శన దృశ్యం

**పటాన్‌చెరు, జనవరి 29, ప్రభాతవార్త:**
క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం చేకూరుతుందని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో గురువారం స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథితులుగా పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, ఎండిఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన గావించి స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. క్రీడాపోటీలలో పాల్గొనే ప్రతి విద్యార్థి, విద్యార్థినులందరు నిజమైన విజేతలే అన్నారు. ఈసందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆలరించాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కరెస్పాండెంట్ జోసెఫ్‌బాబు, సెల్వన్ ఫాదర్, ఇష్టా విద్యాసంస్థల పటేల్ గూడ బ్రాంచ్ ప్రిన్సిపల్ రజిత, బీరంగూడ బ్రాంచ్ ప్రిన్సిపల్ తులసి, ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మిల్క్ రాజు, సన్నీయాదవ్, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితోనే దేశ అభివృద్ధి సాధ్యం

**-బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళియాదవ్**



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్, మురళియాదవ్

**నర్సాపూర్, జనవరి 29, ప్రభాతవార్త:**
కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలోని దేశంలో అభివృద్ధి బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాసు రాధామల్లేష్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు మురళియాదవులు అన్నారు. గురువారం బిజెపి పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులుచింతకుంట శ్రీకాంత్, చింతకుంట నగేష్ ఇద్దరు బిజెపి పార్టీలో చేరారు. చేరినవారికి బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ బిజెపి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంచినాయకులు బిజెపి పార్టీలోనికి రావడం చాలా సంతోషకరమని జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు మురళి యాదవులు అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్, సీనియర్ నాయకులు రమణరావు, పట్టణ అధ్యక్షులు నీరుడి చంద్రయ్య, బిజెపి నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గేదెల్లో కృత్రిమ గర్భధారణతో దూడలు

**-జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య**

**పాపన్నపేట, జనవరి 29, ప్రభాతవార్త:**
గేదెల్లో కృత్రిమ గర్భధారణ వల్ల 90 శాతం ఆడదూడలు జన్మిస్తాయని జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని పొడిచన్పల్లిలో పశువైద్య, పశుసంవర్ధకశాఖ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలు పశువులకు గర్భకోశవ్యాధి నివారణ కోసం పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు గర్భకోశవ్యాధి నివారణ చికిత్సలు చేయించి, పశువులు సకాలంలో చూడి కట్టేలాగా చూసుకోవాలన్నారు. పశువు ఈనినతర్వాత 90రోజుల్లో వ్యాధిలక్షణాలను గుర్తించి, గోపాలమిత్రల ద్వారా, కృత్రిమ గర్భధారణ చేయించుకోవాలన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సాటర్డ్ సెమెన్ ద్వారా, కృత్రిమ గర్భధారణ చేయించడం వల్ల 90శాతం ఆడదూడలు జన్మిస్తాయని చెప్పారు. పుట్టిన లేగదూడలకు 15 రోజుల నుండి ఆరు నెలల వరకు నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి సంతోష్ రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, మఠం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో లబ్ది పొందడానికే కెసిఆర్‌కు సిట్ నోటీసులు..

**-నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్**

**మనోహరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తే ప్రజలు తిరస్కరిస్తారని గ్రహించి, ప్రజల ఏకాగ్రతను దెబ్బతీయడానికి బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులకు సిట్‌నోటీసులు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు తెరలేపిందని మనోహరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్ పేర్కొన్నారు.

ఈ కుట్రలో భాగంగానే కెటిఆర్, హరీష్‌రావు, సంతోష్‌రావులకు సిట్ నోటీసులు ఇచ్చి వారిని విచారణకు పిలిచింది. కానీ ఈ విచారణకు ప్రభుత్వానికి అనుకున్నంత మైలేజ్ రాలేదని, ఇలా అయితే మున్సిపల్ ఎన్నికల్లో గట్టెక్కడం కష్టమని భావించి ఇప్పుడు ఏకంగా బిఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకే నోటీసులు అందజేసిందని, ఎన్నికలు అనగానే కాంగ్రెస్ ప్రభుత్వానికి చెమటలు పడుతున్నాయని, అందుకే డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా ఏదో ఒక నోటీసులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులకు ఇవ్వడం, విచారణ పేరిట కాలక్షేపం చేయడం, కాంగ్రెస్ ఇచ్చిన 420హామీల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్ర మాత్రమేనని ప్రజలందరికీ అర్థమైందని నాయిని ఉదయ్ రంజన్‌గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గత రెండు సంవత్సరాలుగా కాలక్షేపం చేస్తూ, తీరా ఎన్నికలు రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులంటూ బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని, ఇంకొకసారి ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని, ఈ రెండు సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రంలోని ఏ మున్సిపాలిటీలో కూడా నయా పైసా అభివృద్ధి పనులు జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలు పసిగట్టారని, ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించబోతున్నారని, అధికార కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజల సిద్ధమయ్యారని మనోహరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్ ఈసందర్భంగా జరగబోయే దాన్ని గురించి జోస్యం చెప్పారు.

## గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి

**-తహసీల్దార్ సతీష్, ఎంపిడివో విష్ణువర్ధన్**



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎంపిడివో

**పాపన్నపేట, జనవరి 28, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంత క్రీడాకారులు క్రీడల్లో కష్టపడి విజయం సాధించి జాతీయస్థాయికి ఎదగాలని పాపన్నపేట తహసీల్దార్ సతీష్, ఎంపిడివో విష్ణువర్ధన్ సూచించారు, మండల కేంద్రమైన పాపన్నపేటలో రెండు రోజులపాటు నిర్వహించనున్న సిఎంకప్ పోటీలను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, హెచ్ఎం మహేశ్వర్, పిడి రమేష్‌తో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల క్రీడాకారులు పలు పాఠశాలల పిడిలు పాల్గొన్నారు.

## బాలయ్య మృతికి జిల్లాకమిటీ నివాళి



జీపిఓ బాలయ్యకు నివాళులు అర్పిస్తున్న జిల్లా కమిటి బాధ్యులు

**చౌటకూరు, జనవరి 29, ప్రభాతవార్త:**
రోడ్డుప్రమాదంలో బుధవారం మృతిచెందిన మండల పరిధిలోని కోర్పోల్ జీపిఓ బాయికాడి బాలయ్యకు గురువారం జిపిఓ జిల్లా కమిటీ బాధ్యులు నివాళులు అర్పించారు. బుధవారం సాయంత్రం జోగిపేట మండలపరిధిలోని పెట్రోల్ బంక్ వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదలో గాయాలపాలైన బాలయ్యను సంగారెడ్డిలోని స్టార్ హెల్త్ ఆసుపత్రికి తరలించగా చికిత్సనందుకుంటూ గురువారం మృతిచెందారు. బాలయ్య మృతి చెందినట్లు తెలుసుకున్న జిపిఓ జిల్లా కమిటీ బాధ్యులు బాలయ్య చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈసందర్భంగా జిపిఓ అధ్యక్షులు ఎన్.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణ్, కోశాధికారి ఎం.రాంచంద్రయ్యలు మాట్లాడుతూ సంగారెడ్డిలోని జిపిఓలకు సొంత మండలం కాకుండా పక్క మండలం నియమించాలని వినతిచేశారు. జిల్లాలో ఇప్పటివరకు రెండు రోడ్డు ప్రమాదాల్లో జిపిఓలు మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు.

## సోమక్కపేట్ నూతన పాలకమండలిని సన్మానించిన ఎంఈఓ



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎంఈఓ విఠల్

**చిలిపిచెడ్, జనవరి 29, ప్రభాతవార్త:**
చిలిపిచేడ్ మండలంలోని సోమక్కపేట్ గ్రామ నూతన పాలకమండలి సభ్యులను మండల విద్యాధికారి విఠల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి పాలకమండలి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ దుర్గాచలం, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కాంప్లెక్స్ రమేష్, ప్రధానోపాధ్యాయులు సోమకృష్ణ, నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, యాదగౌడ్, మోహన్, మహేష్‌కుమార్, విజయ, విష్ణువర్ధన్, రమాదేవి, సంగీత, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బివిఆర్‌ఐటిని సందర్శించిన కెనడా ఫ్యాకల్టీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కెన్నేత్, బి.కెంట్

**నర్సాపూర్, జనవరి 29, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలను గురువారం కెనడా దేశ న్యూ బ్రన్స్విక్ విశ్వవిద్యాలయానికి చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగం ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ కెన్నేత్, బి.కెంట్‌లు సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లికేషన్ గేమ్, రీసెర్చ్, ఎథిక్స్ వంటి ముఖ్య అంశాలపై విస్తృతంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంజయ్ దుబే, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ పరుచూరి సతీష్‌చంద్ర, మేనేజర్ బాపిరాజు, ఏవో సురేశ్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా చిరుతపులి సంచారం

**-రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన**



రైతులతో మాట్లాడుతున్న బీట్ ఆఫీసర్

**అక్కన్నపేట, జనవరి 29, ప్రభాతవార్త:**
మండలంలోని కేశతండ గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. పలువురు రైతులు ఇచ్చిన సమాచారంమేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దేవేందర్‌రెడ్డి గురువారం ఆయా ప్రాంతాలను సందర్శించారు. ఈసందర్భంగా పులి పాదముద్రలను పరిశీలించగా స్పష్టమైన పాదముద్రలు కనిపించలేదని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రివేళల్లో పొలాలు లేదా బావుల వద్దకు వెళ్లేటప్పుడు ఒంటరిగా కాకుండా గుంపులుగావెళ్లాలని సూచించారు. కేశనాయక్‌తండ, గుబ్బడి, కుందనవానిపల్లి, బంజారాహిల్స్‌తండా, గౌరవెల్లి, మైసమ్మ వాగుతండా పరిసరప్రాంతాల ప్రజలు ప్రత్యేకజాగ్రత్తలు పాటించాలన్నారు. చిరుతపులి కనిపించినా లేదా అనుమానాస్పద కదలికలు గమనించినా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని దేవేందర్‌రెడ్డి రైతులకు సూచించారు.



సమ్మక్క, సారలమ్మకు బంగారం తీసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే

## వన దేవతలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**బెజ్జంకి, జనవరి 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దేవక్కపల్లి, గుండారం గ్రామాల్లో వన దేవతలు శ్రీసమ్మక్క, సారలమ్మలను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఎత్తు బంగారాన్ని సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. అమ్మవార్ల దీవెనలతో ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ:సంతోషాలతో జీవించాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

## అయ్యప్ప దేవాలయానికి రూ.30 వేల విరాళం

**చిన్నకోడూరు, జనవరి 29, ప్రభాతవార్త :** మండలంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న శ్రీ హరిపుత్ర అయ్యప్పస్వామి దేవాలయాన్ని వంగ రాజేశ్వర్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.30 వేలు విరాళంగా అందజేశారు. భవిష్యత్‌లో ఆలయ అభివృద్ధికి అవసరమైన ఎలాంటి సహాయ సహకారాలు అయినా అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి బాబు, కుండె తిరుపతి(బీరయ్య), రాజేష్, రాజు, వంశీ, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో షౌష్టికాహారాన్ని చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్ కొయ్యడ వెంకటేశం



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ వెంకటేశం

**కొండపాక, జనవరి 29, ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కొయ్యడ వెంకటేశం అన్నారు. గురువారం తిమ్మారెడ్డిపల్లి 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. చిన్నపిల్లల్లో పోషకాహారాలోపాన్ని నివారించడానికి బాలమృతం అందించడం జరుగుతుందన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం అంగన్‌వాడిల్లో సరుకులను, ఫుడ్‌ను అందించాలన్నారు. చిన్నారులకు వండిపెట్టిన భోజనాన్ని ఆయన పరిశీలించారు.

## గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి : సర్పంచ్



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్

**సిద్దిపేట అర్బన్, జనవరి 29, ప్రభాతవార్త :** బక్రిచెప్యాల గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేస్తానని సర్పంచ్ జక్కుల శ్రీలతశ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. బక్రిచెప్యాలలో గురువారం నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శ్రీలతశ్రీనివాస్ భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ పంచాయతీ భవనాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావడం జరుగుతుందన్నారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలో మొదటిసారిగా పంచాయతీ భవన నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, పిఆర్ ఏఈ సౌమ్య, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**గ్రామ కోకిల పుస్తకావిష్కరణ...**

సాహిత్యం సమాజ హితమని బాలరచయితల కలం నుంచి జాలువారిన ప్రతి రచన లోకహితమని సినీనటుడు, రచయిత, నిర్మాత జబర్దస్త్ లక్ష్మీ కిరణ్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బక్రిచెప్యాలలో గురువారం విద్యార్థులు రాసిన కథల సంకలనం గ్రామకోకిల పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. కల్మషం లేని బాలల లోకం నిత్యం పూలవనం అవుతుందన్నారు. కథాశిల్పి ఐతా చంద్రయ్య, హెచ్ఎం నాగేందర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం గ్రామకోకిల సంకలన 25 మంది బాలకవులను సత్కారించారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల శ్రీలత శ్రీనివాస్, ఉప సర్పంచ్ గందె నరేష్, వరుకోలు లక్ష్మయ్య, ఉండ్రాళ్ల రాజేశం, నరసింహా రావు, బైతి దుర్గయ్య, వెంకటేశ్వర్లు, రాజయ్య, పూర్ణచందర్‌రావు, శ్రీశైలం పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

**హుస్నాబాద్ రూరల్, జనవరి 28, ప్రభాతవార్త:** మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన బొమ్మగాని కనకయ్య వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా విషయం తెలుసుకున్న సర్పంచ్ తోడేటి రమేష్ ఆధ్వర్యంలో 2 క్వింటాల్ల బియ్యం గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పంపిణీ చేసిన బియ్యం సర్పంచ్ తోడేటి రమేష్ 50 కిలోలు, ఉప సర్పంచ్ పెండ్యాల సంపత్‌రెడ్డి 50 కిలోలు, వార్డు మెంబర్ తాదూరి రేణుకబాబు 25 కిలోలతో పాటు వార్డు సభ్యులు పోలవేణి మహేష్ 25 కిలోల అందజేసినట్లు వారు వివరించారు.

## క్రీడాకారులను ప్రోత్సహించాలి

**-ములుగు ఎస్ఐ రఘుపతి, సర్పంచ్ కనకయ్య**

**ములుగు, జనవరి 29 (ప్రభాతవార్త):** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించాలంటే ప్రతి ఏటా క్రీడాపోటీలను నిర్వహించి ప్రోత్సహించాలని ఎస్ఐ రఘుపతి, సర్పంచ్ తీగుళ్ల కనకయ్య అన్నారు. గురువారం ములుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సిఎం కప్ క్రీడా పోటీలను ఎంపిడివో మేరీ స్వర్ణకుమారి, మండల విద్యాధికార ఉదయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తుండగా మొదటి రోజు కబడ్డీ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీలో మండలం నుండి 15 జట్లు పాల్గొనగా బాలుర విభాగంలో మొదటి స్థానం లో క్షీరసాగర్, రెండవ స్థానం కొట్యాల గ్రామాల జట్లు దక్కించుకున్నాయని తెలిపారు. బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని లక్ష్మక్కపల్లి, ద్వితీయ స్థానాన్ని ములుగు జట్లు కైవసం చేసుకున్నాయని తెలిపారు. శుక్రవారం జరిగే వాలీబాల్ పోటీలలో మండలం నుండి 16 జట్లు పాల్గొంటాయని, చివరి రోజు విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

# వైభవంగా అఖండ శత ఛండీ మహా యాగం

**సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, జనవరి 29, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని పారుపల్లి వీధిలో గల మహమ్మాయి దేవాలయంలో 126 వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ అఖండ శత ఛండీ యాగం వైభవంగా నిర్వహిస్తున్నరు. గురువారం శ్రీ మేధా దక్షిణమూర్తి పూజ, లక్ష పుష్పార్చన, సరస్వతీ పూజలు అర్చకులు శంకరాచారి సారథ్యంలో వేద పండితులు నిర్వహించారు. అలాగే ముత్తయిదువులతో కోటి లలితా పారాయణం నిర్వహించారు. ఉత్సవాలలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆశీర్వాదం చేశారు. అనంతరం స్వర్ణకార సంఘం జిల్లా కన్వీనర్, కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, మహమ్మాయి దేవాలయ కమిటీ, పట్టణ స్వర్ణకార సంఘం ప్రతినిధులు హరీష్‌రావును ఘనంగా సత్కరించి మహమ్మాయిదేవి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

శత చండీ యాగంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. అలాగే పట్టణంలోని కోటిలింగాల దేవాలయంలో జరుగుతున్న శ్రీలలిత తిథి నిత్య మహా యాగ కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అమ్మవారి చిత్రపటం అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరులో...**

మండలపరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతరలో హరీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతో ప్రజలు బాగుండాలని, మళ్లీ మంచి రోజులు రావాలని కోరుకున్నారు. రైతుల ఇబ్బందులను రాష్ట్ర సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. రైతు భరోసాకు దిక్కు లేదు కరెంట్‌కు చక్కగా రావడం రాలేదని విమర్శించారు.

# కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటు

**ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, జనవరి 29 (ప్రభాతవార్త):**

మాజీ సిఎం కెసిఆర్ ప్రాణాలను లెక్కచేయకుండా ఆమరణ నిరాహారదీక్ష చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తికి సిట్ నోటీలను పంపడం సిగ్గుచేటని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గపు పరాకాష్ట చర్యగా అభివర్ణించారు. కెసిఆర్ పులి నోట్లో తన ప్రాణాలు పెట్టి రాష్ట్రాన్ని సాధిస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అన్నారు. కెసిఆర్ పెట్టిన భిక్ష వల్లే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, అది మరిచిపోయి ప్రవర్తించడం మంచిదికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీలేదని, రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో డైవర్షన్ రాజకీయాలు చేసి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు, సంతోష్‌లకు సిట్ విచారణ పేరిట నోటీసులు ఇవ్వడం చాలా దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రంగాల ప్రజలు నష్టపోతున్నారని, వ్యాపారాలు దివాలా తీశాయని, గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందని, పట్టణాల్లో పారిశుధ్యం లోపించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని, రేవంత్‌రెడ్డి విధానాలవల్ల యూరియా దొరకక, విత్తనాలు లేక 24 గంటల కరెంటు రాక, రైతుబంధు, రైతుబీమా, రైతు రుణమాఫీ లేక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా రైతాంగానికి ఒక్క ఎకరానికి సాగునీరు అందించిన పాపాన పోలేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కడ ఓడిపోతామోనని రేవంత్‌రెడ్డికి భయం పుట్టిందని, అందుకే సిట్ లాంటి పనికిమాలిన విచారణలతో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగురుతుందని, రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్ వెంటే ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి కళ్లు తెరిచి ఫోన్ ట్యాపింగ్ అనేది కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆదీనంలో ఉంటుందని, ముఖ్యమంత్రికి, మంత్రులకు సంబంధం ఉండదని తెలిపారు. పనికిమాలిన విచారణల పేరిట కాలయాపన చేయకుండా రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు దేవి రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, అనంతుల ప్రశాంత్, రామచంద్రంయాదవ్, ఉపేందర్‌రెడ్డి, నూనె కుమార్ యాదవ్, ఊడెం కృష్ణారెడ్డి, మద్దూరి రాజిరెడ్డి, రఘుపతిరెడ్డి, పాల రమేష్‌గౌడ్, కిషన్‌రెడ్డి, భీమప్ప, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి



గద్దర్ జయంతి సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## హైదరాబాద్‌లో గద్దర్ స్మృతివనాన్ని ఏర్పాటు చేయాలి

**-డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్**

**గజ్వేల్ టౌన్, జనవరి 29 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం హైదరాబాద్‌లో మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించి గద్దర్ స్మృతి వనంను ఏర్పాటు చేయాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. ఈనెల 31వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి సభకు సంబంధించిన గోడపత్రికలను గురువారం గజ్వేల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సభకు గద్దర్ అభిమానులు, సామాజిక కార్యకర్తలు, ఉద్యమకారులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు పి.ఎల్లయ్య, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, గౌసొద్దీన్, చంద్రం, ఉమర్, సొక్కం నర్సింలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పసిడి పతకం సాధించిన రామ్‌మోహన్

**నార్సింగి, జనవరి 29 ప్రభాతవార్త :**

మహారాష్ట్రలోని నాసిక్ సిటీలో జరుగుతున్న నేషనల్ మాస్టర్స్ గేమ్స్-2026. టోర్నమెంట్‌లో జావాలీన్‌త్రోలో మణికొం డ బాల్ బ్యాట్మింటెన్ అధ్యక్షుడు పసిడి పతకంను సాధించాడు. పాల్గొన్న ప్రతీ టోర్నీలో పతకాలు సాధించడంను అలవా టుగా మార్చుకున్న రామ్‌మోహన్ మరోమారు ప్రతిభను చాటుకున్నాడు. పసిడి పతకం సాధించడం పట్ల మణి కొండ వాసులు అభినందనలు తెలుపుతున్నారు. క్రీడాకారుల ప్రతిభ పోటీలలో తను సాధించే పతకాలను బట్టి వెల్లడవు తుందని, ప్రతీసారి పసిడి పతకాలనే సాధించి తీసుకు వస్తు న్న రామ్‌మోహన్ మణికొండ నివాసితుడు కావడం గర్వంగా ఉందని బిఆర్ఎస్ నేత అండె లక్ష్మణ్‌రావ్ పేర్కొన్నారు.



జహీరాబాద్ కోర్టుకు హాజరైన బిఆర్ఎస్ నాయకులు

## బిఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ అక్రమ కేసులు

**కోర్టుకు హాజరైన నాయకులు**

**జహీరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు పెట్టిన అక్రమ కేసులను పురస్కరించుకుని గురువారం బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు నామా రవికిరణ్, కొమారి జగదీష్, ఆనందం, ఎర్రోళ్ల శివప్ప, రాథోడ్ భీంరావ్, హీరు రాథోడ్ పట్టణంలోని కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో 19 జులై 2025న సెట్విన్ సంస్థకు సంబంధించిన అధికారిక కార్యక్రమం నిర్వహించగా స్టేజీపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో దళిత ఎమ్మెల్యే అయినందునే కొనింటి మాణిక్‌రావు ఫోటోను ప్రచురించలేదన్న విషయాన్ని కార్యక్రమం ముగిసాక అధికారులకు అడిగి నిరసన వ్యక్తం చేశామని, నిరసన వ్యక్తం చేస్తే కేసులు నమోదు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో పోలీసులు తమకై కేసులు నమోదు చేసేలా చేసి కోర్టు చుట్టూ తిప్పుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని, తమకు న్యాయం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు.

## కల్హేర్‌లో మురుగు కాల్వల పరిశుభ్రం

**కల్హేర్, జనవరి 29, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కల్హేర్‌లో గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు మురుగుకాల్వలను గ్రామ సర్పంచ్ కోడి గంగారం దగ్గరుండి పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోడి గండారం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నిజాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకుని పరిశుభ్రతపై ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు.

# రైతుబంధు, పంట నష్టం డబ్బులు విడుదల చేయాలి

**మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

బ్రేకులు లేని బస్సులా కాంగ్రెస్ పాలన సాగుతుందని వెంటనే రైతుబంధు, బోనస్, పంట నష్టం డబ్బులు విడుదల చేయాలని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు భరోసా లేదు పెట్టుబడి సాయానికి దిక్కులేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నట్టేట ముంచుతున్నాయని చెప్పారు. బిజెపి నల్లచట్టాలు తెచ్చి రైతులను ఇబ్బంది పెడుతుందని విమర్శించారు. ప్రభుత్వాలు కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తున్నాయన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఏనాడూ ఎరువుల కొరత రాలేదన్నారు. రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వం చెప్పాలన్నారు. ప్రభుత్వానికి సిట్‌లు కేసులు తప్ప రైతుల గోస పట్టడం లేదని తెలిపారు. రైతుల నోట్లో మట్టికొట్టి...బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తారా అని ప్రశ్నించారు. మెదక్ జిల్లాలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని సింగూరు ప్రాజెక్టు కింద 40 వేల ఎకరాలు, గణపురం ప్రాజెక్టు కింద 70 వేల ఎకరాలకు క్రాప్‌హాలిడే ప్రకటించారని తెలిపారు. రైతులకు ఇవ్వడానికి నీళ్ల లేవు కానీ బీరు ఫ్యాక్టరీలకు ఎక్కడినుంచి వస్తున్నాయని ప్రశ్నించారు.



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరీష్‌రావు

ఎక్సైజ్‌శాఖ కార్యదర్శి స్వయంగా వచ్చి బీరు ఫ్యాక్టరీలకు నీళ్ల ఆపొద్దు ఇవ్వండి అని ఆదేశాలు ఇస్తున్నారని మండిపడ్డారు. రైతుల కంటే బీరు ఫ్యాక్టరీల ఓనర్లు ఇచ్చే లంచాలు, కమీషన్లే ముఖ్యమా అని ప్రశ్నించారు. కేంద్ర సర్కార్ కందులకు రూ.8 వేల మద్దతు ధర నిర్ణయించిందని దళారులను నమ్మి మోసపోకుండా రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పెద్ద ఎత్తున్న పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ అధికారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిఆర్ఎస్ నేతలు

## సిఎం దిష్టిబొమ్మ దహనం

**సిద్దిపేట అర్బన్, జనవరి 29, ప్రభాతవార్త :** మాజీ సిఎం కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ సిద్దిపేటలోని డాక్టర్ బాబుజగ్జీవన్‌రాం చౌరస్తాలో గురువారం సాయంత్రం బిఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా, కెసిఆర్, బిఆర్ఎస్‌కు అనుకూలంగా నినాదాలతో హోరెత్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనచేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడానికి బిఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుతగలడంతో పోలీసు, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. చివరికి బిఆర్ఎస్ శ్రేణులు సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను టచ్ చేయడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే : ఉపేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

**గజ్వేల్, జనవరి 29 (ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావును టచ్ చేయడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, సిట్ పేరిట బిఆర్ఎస్ నాయకులను, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా పాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమం మరిచి కెసిఆర్ కుటుంబాన్ని అబాసుపాలు చేసేందుకు ప్రయత్నం కొనసాగిస్తున్నారన్నారు. సిట్ విచారణ పేరుతో కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వడం మంచిదికాదని హెచ్చరించారు. కెసిఆర్‌పై బురద చల్లాలని ప్రయత్నించడం ఆకాశం పైకి ఉమ్మి వేయడమేనని అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. ఆయన వెంట జగదేవ్‌పూర్ మాజీ జెడ్‌పిటిసి కవిత, సుధాకర్‌రెడ్డి, మద్ది రాజిరెడ్డి ఉన్నారు.

## వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే డైవర్షన్ పాలిటిక్స్

**బిఆర్ఎస్ యువ నాయకుడు సాయిప్రేమ్**

**కొండపాక, జనవరి 29, ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకొని సింగరేణి కుంభకోణం నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు సామల్ల సాయిప్రేమ్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ కెసిఆర్‌ను టచ్‌చేయడమంటే తెలంగాణ అత్మ గౌరవాన్ని టచ్ చేయడమేనన్నారు. కెసిఆర్‌పై బురద చల్లితే అకాశంపై ఉమ్మినట్లుగా ఉంటుందన్నారు. సిట్ పేరుతో బిఆర్ఎస్ నాయకులను వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. అధికారం చేతిలో ఉందని అహంకారంతో వ్యవహరిస్తే ప్రజల చేతిలో పరాభవం తప్పదని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ప్రజానీకం కెసిఆర్ వెంటేఉందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ముందుగా ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయడంలో విఫలమై డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపడని వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన విమర్శించారు.

## 31న మండల స్థాయి క్రీడాపోటీలు

**కొండపాక, జనవరి 29, ప్రభాతవార్త:** కుకునూరుపల్లి మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ఈ నెల 31న కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ రాంప్రసాద్, ఎంఈఓ బచ్చలి సత్తయ్య తెలిపారు. సీఎం కప్ రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే పాల్గొనడానికి అర్హులని వారు తెలిపారు. 31వ తేదీ పురుషులకు, మహిళలకు వాలీబాల్, కబడ్డి, కోకోతోపాటు యోగా, కరాటే, చెస్ అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ రిక్రియేషన్ తదితర క్రీడాంశాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న జిరాక్స్ కాపీ, అధార్ కార్డుతో హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో క్రీడ కార్యదర్శి క్యాతం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తొగుట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే క్లినిక్

**తొగుట, జనవరి 29, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ధన్‌రాజ్ ఆదేశాల మేరకు తొగుట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డాక్టరనరాధాకృష్ణ పర్యవేక్షణలో టీబి ముక్త భారత్ ప్రోగ్రాంలో భాగంగా మొబైల్ ఎక్స్ రే క్లినిక్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఎన్‌సిడి పేషెంట్‌కు ఎక్స్‌రే పరీక్షలు, బీపీ, రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓ స్వరూప, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, టీబీ నియంత్రణ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. 40 మందికి పరీక్షలు నిర్వహించారు.

## శ్రీ షిర్డీసాయి దివ్య మందిరంలో వార్షికోత్సవ వేడుకలు

**గజ్వేల్ టౌన్, జనవరి 29 (ప్రభాతవార్త):**

గజ్వేల్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల శ్రీ షిర్డీసాయి దివ్య మందిరంలో ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 5 గంటలకు మేలుకొలుపు, హారతి, 6 గంటల నుండి 9 గంటల వరకు భక్తులచే ఆవుపాలతో ప్రత్యేక అభిషేకం, 10 గంటలకు శ్రీ సంతోషి సేవా పరిషత్ వారిచే శ్రీ లలితా సహస్ర నామ పారాయణం, రుద్ర హవనము, పూర్ణాహుతి, మధ్యాహ్నం 1 గంటలకు హారతి, విశేష అలంకరణ దర్శనము, తీర్థ ప్రసాద, అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం 6.30 గంటలకు ధార్మిక ప్రవచనము, 7.30 గంటలకు పల్లకిసేవ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే

**బెజ్జంకి, జనవరి 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వనదేవతలు సమ్మక్క, సారలమ్మ జాతరలో ఎమ్మెల్యే, టిపిసిసి ఎస్సీసెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవార్లకు ఎత్తుబంగారాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.



వనదేవతలకు బంగారం తీసుకెళ్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

## నేడు న్యాల్‌కల్ దర్గాను దర్శించుకోనున్న ఎంపి

**న్యాల్‌కల్, జనవరి 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామ శివారులోని హజ్రత్ ఫీర్ గైబ్ సాహెబ్ దర్గా జాతర ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం అవుతున్నందున జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్, మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి, టిఎస్‌ఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, కాంగ్రెస్ నాయకులు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లున మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, జాతర ఉత్సవ కమిటి బాధ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 1గంటకు ప్రజాప్రతినిధులు, నాయకులు దర్గాకు చేరుకుని దర్గాకు దట్టిని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

-స్వతంత్ర అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మి


నామినేషన్ వేసిన దొడ్ల విజయలక్ష్మి

**సదాశివపేట, జనవరి 29, ప్రభాతవార్త:**
సదాశివపేట పట్టణంలోని 16వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా దొడ్ల విజయలక్ష్మి భారీసంఖ్యలో కార్యకర్తలతో కలిసి నామినేషన్ దాఖలు చెయ్యడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్ల వెంకట్, వెంకటాపురం హేమలత, పట్నం సరిత, గువ్వల లక్ష్మీ, మంగమ్మ, నర్సమ్మ, హేములమ్మ, శ్రీశైలం, నవీన్, అన్నపూర్ణ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో భారీ చేరికలు


వివిధ పార్టీల నాయకులు కండువాలు కప్పుకుంటున్న దృశ్యం

**గుమ్మడిదల, జనవరి 29, ప్రభాతవార్త:**
గుమ్మడిదలమండల బిజెపిశాఖ ఆధ్వర్యంలో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు, బొంతపల్లి, గుమ్మడిదల, అన్నారం వార్డుల నుంచి బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం ఉదయం పటాన్‌చెరులో బిజెపిలో భారీగా చేరికలు చేపట్టారు. ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈసందర్భంగా పార్టీలోచేరిన నాయకులు, మహిళా కార్యకర్తలకు బిజెపి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గుమ్మడిదల మండల అధ్యక్షులు కావలి ఐలేష్, మున్సిపాలిటీ కన్వీనర్ రాజిరెడ్డి, నాయకులు పలుగు గోవర్ధన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణ, శివరాత్రి రాజు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## విబిజిరామ్‌జిని రద్దుచేయాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్యం


ఉపాధి హామీ కూలీ కార్మికులతో మాణిక్యం

**కొండాపూర్, జనవరి 29, ప్రభాతవార్త**
ఉపాధిచట్టాన్ని దెబ్బతీసే విబిజిరామ్‌జి చట్టాన్ని రద్దుచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్యం అన్నారు. గురువారం మండలం సీతారాంకుంట తండాలో ఉపాధికూలీలతో సిపిఎం బృందం పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండలకార్యదర్శి రాజయ్య, మండలకమిటీ సభ్యులు బాబురావు, ఉపాధి కూలీలు సుభాష్, మానేయ, సావిత్రి, లక్ష్మి, జిమ్మకుబాయి, లాస్కీ బాబి, చంద్రి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో సమీక్ష నిర్వహించిన కార్పొరేటర్


అధికారులతో సమీక్షిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జనవరి 29, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్‌పరిధిలో జిహెచ్‌ఎంసి నిధులతో చేపట్టిన అభివృద్ధిపనుల ప్రారంభోత్సవాలపై గురువారం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్‌కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ శ్రీనివాస్‌నగర్ కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి సమీక్షించారు. అభివృద్ధిపనులు వెంటనే పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని, నిర్మాణం పనులు పూర్తయిన వెంటనే ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉందని, అందుకు అధికారులు తగుచర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పుష్పనగేష్ జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగ ఈఈ సురేష్, డిఈ వెంకటరమణ, ఏఈ శివకుమార్, జలమండలి డిజిఎం శివకృష్ణ, సానిటేషన్ సూపర్‌వైజర్ కేశవులు, సానిటేషన్ ఎస్‌ఎఫ్‌ఏలు, రాంకీ అధికారులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, అర్బన్ బయో డైవర్సిటీ అధికారులు, విద్యుత్ విభాగ డిఈ చరణ్‌సింగ్‌లకు సూచించారు.

**వర్షపు నీరు ఆగకుండా చూడండి: అధికారులతో కార్పొరేటర్...**
రామచంద్రారెడ్డినగర్ కాలనీలోని సుజుకి షోరూం వద్ద నుంచి వర్షపు నీరు మళ్లించేందుకు గురువారం కార్పొరేటర్ పుష్పనగేష్ కాలనీ అధ్యక్షులు వెన్నవరం మల్లారెడ్డి, నేషనల్‌హైవే అథారిటీ ఆఫీసర్ స్వామి, కాంట్రాక్టర్, జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ, వర్షపు నీరు కాలనీలో ఆగిపోకుండా ఇటీవలవేసిన పైప్‌లైన్‌నుంచి ఔట్లెట్ చెయ్యాలని అధికారులను ఆదేశించామన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రామచంద్రాపురం రైల్వే ట్రాక్, మెయిన్ రోడ్డు బజాజ్ షోరూం, అశోక్‌నగర్, జ్యోతి సినిమా థియేటర్ వద్ద ఓపెన్ డ్రెయిన్‌లు ముందు ఉన్న రోడ్డు వరకు ఉన్న పైప్‌లైన్‌లు సర్వీస్ రోడ్డు పనులతో మరమ్మతు దశకు చేరుకున్నాయని, బాక్స్ డ్రెయిన్‌లు అన్ని ప్రాంతాల్లో కట్టి నీరు మళ్లించాలని ఆదేశించారు.

# కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వరస్వామి దేవాలయం

**నంగునూర్, జనవరి 29, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కోనాయిపల్లిలో సెంటిమెంట్ దేవునిగా ప్రసిద్ధిచెందిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. సుమారు 8 దశాబ్దాల కింద మండలంలోని కోనాయిపల్లిలో వేంకటేశ్వరస్వామిని ప్రతిష్ఠించారు. అప్పటినుంచి భక్తులపాలిట కొంగుబంగారంగా వేంకటేశ్వరస్వామి ఆలయం వెలుగొందుతోంది. ఈనెల30నుంచి ఫిబ్రవరి 1వతేదీవరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి ఆలయకమిటీ ఏర్పాట్లుపూర్తిచేసింది. కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి తెలంగాణ ఉద్యమ నాయకుడు, రాష్ట్ర తొలి సిఎం కెసిఆర్ సెంటిమెంట్ దేవునిగా తెలంగాణ ఉద్యమ సమయంలో జాతీయ స్థాయిలో విశేషప్రాచుర్యం పొందారు. ఉద్యమసమయంలో తీసుకున్న నిర్ణయాలన్నీ ఈ దేవాలయంలో మొదట పూజచేసిన తర్వాత కావడం విశేషం. తెలంగాణ మలిదశ ఉద్యమం 2001లో టిఆర్‌ఎస్ ఏర్పాటుతో ప్రారంభమై ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. కెసిఆర్ 2001 ఏప్రిల్ 27న కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో ప్రత్యేకపూజలు చేసిన తరువాతనే హైదారాబాద్‌కు వెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని స్థాపించారు. ప్రస్తుత మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుసైతం ఈ ఆలయంలో ప్రత్యేక పూజలుచేయడం ఆనవాయితీగా వస్తోంది. 2001లో సిద్దిపేట స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన ఆనాటి ఉమ్మడిరాష్ట్ర సిఎం, ప్రస్తుత ఎపి సిఎం నారా చంద్రబాబునాయుడు సైతం ఈ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. పాత ఆలయం స్థానంలో విశాలమైన దేవాలయాన్ని నూతనంగా నిర్మించారు. రాజగోపురం, విశాలమైన ఆలయ మండపం, స్వామివారి గర్భగుడి, పద్మావతీదేవి, గోదాదేవి ఆలయాలను నిర్మించారు. స్వామివారి గర్భగుడికి ఎదురుగా గరుత్మంతుడి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో ప్రత్యేకంగా ఆంజనేయుడిని ప్రతిష్ఠించారు. మండపానికి రాజగోపురానికి మధ్య ఎత్తయిన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ప్రత్యేకంగా హోమ గుండం నిర్మించారు. ఆలయం వెనుక వైపు గ్రామంలో ఆలయానికి సంబంధించిన రెండెకరాల స్థలంలో స్వామి వారి కళ్యాణమండపాన్ని నిర్మించారు. ప్రతియేటా ఈ ఆలయంలో మాఘమాసం శుద్ధ ద్వాదశి నుంచి మూడు రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాలో భాగంగా ప్రతి నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## నేటి నుంచి న్యాల్‌కల్ పీర్‌గైబ్ సాహెబ్ జాతర

-దర్గాను దర్శించుకోనున్న లక్షలాది భక్తులు

**న్యాల్‌కల్, జనవరి 29, ప్రభాతవార్త:**
వారంరోజుల పాటు మండలకేంద్రమైన న్యాల్‌కల్‌గ్రామ శివారులోని కొండ గట్టుపై కొలువున్న ఉర్సే షరీఫ్ హజ్రత్ పీర్‌గైబ్ సాహెబ్ ఖిల్లా 359వ జాతర నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ బాధ్యులు తగు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ఈ నెల 30వ తారీఖు నుంచి ఫిబ్రవరి 6వ తారీఖ వరకు జరిగే జాతర ఉత్సవాలకు ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు కర్ణాటక, మహారాష్ట్రాల ప్రాంతాలనుంచి లక్షలాదిగా భక్తులు చేరుకుని దర్గాను దర్శించుకుని తమమొక్కులు చెల్లించుకుంటూ ఉంటారు. జాతర ఉత్సవాలకు కుస్తీపోటీలు హైలెట్‌గా నిలుస్తాయి.

**జాతర ఉత్సవాల వివరాలు ఇలా...**
ఈనెల 30న రాత్రి 8గంటలకు న్యాల్‌కల్‌లోని మాలిపటేల్ స్వర్గీయ ఉస్మాన్ పాటిల్ ఇంటినుంచి సర్కారి గంధం ఊరేగిస్తూ దర్గాకు చేరుకుంటారని ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎండి యునూస్‌ఖాన్, ఉపాధ్యక్షులు గొల్ల నర్సిములు, దర్గా సాహెబ్ మక్సుద్ అలీలు తెలిపారు. 31న కూరగాయలసంత, గంధం ఊరేగింపు దర్గావరకు, 1న పశువులసంత, రాత్రి హద్నూర్ గ్రామం నుంచి దర్గావరకు ఊరేగింపు, ఖవాలి కార్యక్రమాలు, 2న న్యాల్‌కల్ గ్రామం నుంచి ఖురేషిగంధం ఊరేగింపు, దర్గావద్ద ఖవ్వాలి కార్యక్రమాలు, 3న ఉదయం 9 గంటల నుంచి అంతర్‌రాష్ట్ర కుస్తీ పోటీలు, పోటీల్లో ప్రతిభచాటిన మల్ల యోధులకు న్యాల్‌కల్ సర్పంచి జ్యోతి ప్రవీణ్ రూ.25వేలు, గుంజోటి సర్పంచి దేశెట్టి పాటిల్ రూ.20వేల51, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, మెటల్‌కుంట మాజీ సర్పంచి గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ మడపతి సిద్దలింగయ్యస్వామి, పడకంటి వెంకట్, అబ్దుల్ ఖాదరర్ ఖురేశి, గొల్ల దత్తు, ముంగి సర్పంచి అరుణశ్రీనివాస్‌రెడ్డిల సహకారంతో తలా 5తులాల వెండికడియాలను బహూకరించనున్నారు.

## విద్యార్థులకు క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మేధాశక్తిని పెంపొందించుతాయి

-ఎంపిడివో శ్రీనివాస్


విజేలను అభినందించిన ఎంఈవో బాల్‌రాజ్, మాజీసర్పంచి కుర్మ శేఖర్

**కౌడిపల్లి, జనవరి 29, ప్రభాతవార్త:**
విద్యార్థులకు క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మేధాశక్తిని పెంపొందించడానికి ఎంతో దోహదపడుతాయని ఎంపిడివో శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండలస్థాయి సిఎంకప్ క్రీడల్లోభాగంగా ఖోఖో క్రీడాపోటీలను మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నతపాఠశాల ఆవరణంలోనిర్వహించగా, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంఈవో బాల్‌రాజ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరైనారు. జ్యోతి ప్రజ్వలనం గావించి ఖోఖో క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంపిడివో శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం ద్వారా నిర్వహించే క్రీడలను సద్వినియోగం చేసుకొని తమప్రతిభలను ప్రదర్శించుకోవాలని ఆయన అన్నారు. ఈక్రీడల్లో ఉత్తమప్రతిభను కనపరిచిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో ఆటలు ఆడించబడుతాయని ఆయన గుర్తుచేశారు. అనంతరం ఎంఈవో బాల్‌రాజ్ మాట్లాడుతూ సిఎంకప్ క్రీడల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపిక చేసి పంపడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ఐదు క్లస్టర్లలో గ్రామస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తామని, మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గంలో ఆడుతారని అన్నారు. కాగా, వాలీబాల్ బాలురవిభాగంలో ఐదుక్లస్టర్ టీములు పాల్గొనగా రాయిలాపూర్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలువగా, కౌడిపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థులు ద్వితీయస్థానంలో వచ్చినారని ఆయన అన్నారు. వాలీబాల్ బాలికల విభాగంలో 2 క్లస్టర్లు పాల్గొనగా భుజిరంపేట ఉన్నత పాఠశాల ప్రథమస్థానం, వెల్మకన్నే పాఠశాల ద్వితీయ స్థానంలో వచ్చినట్లు ఆయన తెలిపారు. ఖోఖో క్రీడల్లో బాలికలలో 2 క్లస్టర్లు పాల్గొనగా సలాబత్‌పూర్ ప్రథమస్థానం, వెల్మకన్నె ద్వితీయస్థానంలో గెలుపు సాధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీరితోపాటు పిడిలు విజయ కుమార్, శేఖర్, పూర్ణచంద్, పిఈటిలు కృష్ణగౌడు, అజీమ్, రాయిలాపూర్ సర్పంచి ధనలక్ష్మిశేఖర్, మాజీసర్పంచి కుర్మ శేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి భవానీమాత 26వ జాతర

-22 నుంచి కొనసాగుతున్న దేవి పురాణం, భజనలు, కీర్తనలు

**న్యాల్‌కల్, జనవరి 29, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని రత్నాపూర్‌గ్రామంలో కొలువుండి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న శ్రీభవానీమాత ఆలయం 26వ వార్షికోత్సవాలను ఈ నెల 31న నిర్వహించేందుకు ఉత్సవకమిటీనిర్వాహకులు ఏర్పాట్లుపూర్తిచేశారు. జాతరను పురస్కరించుకుని ఈ నెల 22వ తారీఖు నుంచి 30వ తేదీవరకు మెళగిమఠం యాదగిరి పీఠాధిపతులు వేదమూర్తి మల్లికార్జునశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు దేవీపురాణం పారాయణం నిర్వహిస్తున్నారు. ప్రతినిత్యం రాత్రి 8గంటల నుంచి 10గంటల వరకు ఆలయ అర్చకులు వీరయ్యస్వామి హిరేమఠ్‌చే అమ్మవారికి పూజాకార్యక్రమాలు, భజనలు, కీర్తలను కొసాగుతాయి. 9రోజులపాటు ఆలయ ఆవరణలో దేవీపురాణం, భజనలు, కీర్తనలు నిర్వహించి 10వరోజు (జనవరి 31న) ఉదయం ఆలయంలో అమ్మవారికి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తూ ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు అన్నదానం (గోధుమ పాయసం) వితరణ చేస్తారు.

**రాత్రికి సంగీత్ దర్బార్...**
ఆలయవార్షికోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి పూజలు, ఊరేగింపు, రాత్రి 10గంటల నుంచి తెల్లవారు ఝాము 6గంటలవరకు కళ్యాణ్‌రావు పాటిల్ గుమ్మా, కంద్రప్ప పాటిల్ హల్లడక్కంల ఆధ్వర్యంలో సంగీత్ దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ బాధ్యులు తగు ఏర్పాట్లు పూర్తిచేశారు.

## రామచంద్రారెడ్డినగర్ అభివృద్ధికి కృషిచేస్తా

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రామచంద్రారెడ్డినగర్ వాసులు

**రామచంద్రాపురం, జనవరి 29, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. కాలనీ అధ్యక్షులుగా ఎన్నికైన వెన్నవరరం మల్లారెడ్డిని, కాలనీవాసులను ఎమ్మెల్యే కలుసుకుని కాలనీ అభివృద్ధిపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను కాలనీ అధ్యక్షులు, కాలనీవాసులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు, యువకులు పాల్గొనగా కాలనీ అధ్యక్షులుగా ఎన్నికైన మల్లారెడ్డిని ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## బిఆర్‌ఎస్ అభ్యర్థుల మొదటిజాబితా విడుదల

**జహీరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:**
మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని బిఆర్‌ఎస్ పార్టీ మిగతా రాజకీయ పార్టీల కంటే ముందుగా 21వార్డులలో పోటీచేసే అభ్యర్థుల జాబితాను (మొదటిలిస్టు)ను గురువారం విడుదల చేసింది. బిఆర్‌ఎస్ విడుదల చేసిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని 2వ వార్డును మనెమ్మగౌడ్, 3వ వార్డు పురుషోత్తంరెడ్డి, 5వ వార్డు మధ్య ప్రేమలతశంకర్ రెడ్డి, 6వార్డు సైజిబేగం శంషుద్దీన్, 7వ వార్డు రవికుమార్‌చౌహాన్, 8వ వార్డు కళ్లెం రవీందర్, 9వ వార్డు బిల్లీపురం పాండుముదిరాజ్, 10వ వార్డు సయ్యద్ మోయుద్దీన్, 12వ వార్డు ఎంఇ తంజీమ్, 16వ వార్డు బరూర్ స్వప్న దత్తాత్రి, 19వ వార్డు ఎర్రోళ్ల దీపక్, 20వ వార్డు నడిపిదొడ్డి విజయరాజు, 23వ వార్డు పి.మంజుల, 24వ వార్డు పర్వీన్ జహీర్, 25వ వార్డు ఎండి జాకీర్, 26వ వార్డు బండి మోహన్, 27వ వార్డు సరస్వతి నామరవికిరణ్, 30వ వార్డు అన్నపూర్ణ అశోక్‌శేరి, 32వ వార్డు మజ్జిగ సుజాత, 33వ వార్డు జిహెదాబేగం, 35వ వార్డు పర్వీన్‌బేగం అబ్దుల్లాలకు పోటీచేసే అవకాశం కల్పిస్తూ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఇంచార్జి దేవి ప్రసాద్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్‌ల జాబితాను ప్రకటించింది. మిగతా 16మంది అభ్యర్థులను శుక్రవారం విడుదలచేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నామినేషన్‌లకు ఈ నెల 30వ తేదీ చివరిరోజు.

# మున్సిపాలిటీ పరిధిలో స్మైల్ టీం విస్తృత తనిఖీలు

-పటాన్‌చెరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో పర్యటన
-గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఆపరేషన్


తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జనవరి 29, ప్రభాతవార్త:**
పిల్లలహక్కులపరిరక్షణ, బాలకార్మికవ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు సబ్‌డివిజన్‌పరిధిలోని గుమ్మడిదల మున్సిపాలిటీ ప్రాంతంలో విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టారు. కార్యక్రమానికి పటాన్‌చెరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ నేతృత్వం వహించారు. ఈసందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీపరిధిలోని పలుదుకాణాలు, వాణిజ్య సంస్థలు, చిన్న పరిశ్రమలను సందర్శించి అక్కడ పనిచేస్తున్న కార్మికుల వివరాలను సిబ్బంది పరిశీలించారు. ముఖ్యంగా బాలకార్మికులు పనిచేస్తున్నారా, లేదా? కార్మికచట్టాలు పాటిస్తున్నారా, లేదా? అనే అంశాలపై ప్రత్యేకదృష్టి సారించారు. ఎక్కడైనా చట్టవిరుద్ధంగా పిల్లలను పనిలో పెట్టుకున్నట్లయితే కఠిన చర్యలు తప్పవని దుకాణదారులకు హెచ్చరికలు జారీచేశారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, బాలల భవిష్యత్తు దెబ్బతినకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత. పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం. అలాంటి ఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలను వినియోగించుకోవాలని యజమానులకు అవగాహన కల్పించారు. అధికారులు సమన్వయంతో నిర్వహించిన ఈతనిఖీలు గుమ్మడిదల ప్రాంతంలో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ పిల్లల హక్కులను కాపాడాలని, బాలకార్మిక నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములుకావాలని అధికారులు పిలుపునిచ్చారు. తనిఖీల్లో ఆయనవెంట వెంకటరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్, బిసి సిడబ్ల్యుసి సభ్యులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భవిత భవన నిర్మాణానికి సర్పంచి భూమిపూజ


భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న సర్పంచి కోడి గంగారం

**కల్హేర్, జనవరి 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కల్హేర్‌లో భవిత భవన నిర్మాణానికి గ్రామ సర్పంచి కోడి గంగారం భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి భవన నిర్మాణానికి గురువారం శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు జనార్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా సిఎం కప్ క్రీడలు


సిఎం కప్ క్రీడలను ప్రారంభిస్తున్న నత్తి దశరథ్

**చౌటకూరు. జనవరి 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులో మూడురోజుల పాటు కొనసాగే సిఎం కప్ క్రీడలను గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అండర్ 14, 17 బాలికలు, బాలురకు ఖో-ఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ లాంటి క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ కె.శంకర్ తెలిపారు. మొదటిరోజు సాయంత్రం వరకు బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 30న బాలురకు, 31న బాలికలు, బాలురకు ఫైనల్‌పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంఈఓ అనురాధ ఎంపిఓ సువర్ణ, గిర్దవార్ ప్రమోద్‌కుమార్, టిపిఆర్టీయు మండలాధ్యక్షులు మోహన్‌రెడ్డి, సర్పంచులు రామచంద్రారెడ్డి, జైపాల్ నాయక్, బోడపట్ల గణేష్‌ముదిరాజ్, మల్లారెడ్డి, మల్లేశం, చిన్నరోళ్లపాటి అనసూయ రాజశేఖర్, కుమ్మరి నవనీతఅశోక్, గణపతినాయక్, పిఈటిలు, పిడిలు పాల్గొన్నారు.

## బాలికలకు భద్రత స్కిల్స్‌పై అవగాహన



బాలికలకు సేఫ్టీ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**చౌటకూరు, జనవరి 29, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని శివంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అందుకుంటున్న బాలికలకు రక్షణకు సంబంధించిన మెళకువలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిఎంశ్రీ కింద పాఠశాల ఎంపిక కావడంతో గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా కరాటేలో శిక్షణ ఇస్తున్నామని ఇంచార్జులు శ్రీదేవి, రాములు తెలిపారు. కరాటేలో శిక్షణ పూర్తిచేసుకుంటే బాలికలకు ఎంతగానో రక్షణగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు మల్లేశం పేర్కొన్నారు. కార్యక్రమంలో మాణిక్యం, స్వప్న, శైలజ, వాణిశ్రీ, నాగశ్రీ, సునీతాబాయి, సునీతావేణి, మోజీద్, రమేశ్, నవీన్‌లు పాల్గొన్నారు.

## రెండవ రోజు 74 నామినేషన్లు


నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అరుణ్‌కుమార్

**జహీరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:**
జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని నామినేషన్‌ల ప్రక్రియలో భాగంగా రెండవ రోజైన గురువారం కౌన్సిలర్ స్థానాలకు 74 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ జైత్రం తెలిపారు. కాంగ్రెస్ నుంచి 37మంది, బిఆర్‌ఎస్ నుంచి 22మంది, బిజెపి నుంచి 7మంది, ఎంఐఎం నుంచి ఒక నామినేషన్, స్వతంత్రులుగా 6 నామినేషన్‌లు దాఖలయ్యాయి. శుక్రవారం నామినేషన్‌లకు చివరిరోజు కావడంతో పెద్ద ఎత్తున నామినేషన్‌లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ముగిసిన సిఎం కప్ క్రీడలు


క్రీడాపోటీల్లో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

**కంగ్టి, జనవరి 29, ప్రభాతవార్త:**
సిఎం కప్ క్రీడా పోటీలు గురువారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో కంగ్టిలోని టిటిడబ్లుఆర్‌జెఎస్ కళాశాలలో నిర్వహించి విజేతలకు ఎంపిడిఓ సత్తయ్య ఎంఈఓ రైమోద్దీన్, డిప్యూటీ తహసీల్దార్‌లతో కలసి బహుమతులు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం కప్ క్రీడా పోటీల్లో విన్నర్, రన్నర్‌ల వివరాలు ఇలా ఉన్నాయి. కబడ్డీ పురుషుల విభాగంలో కంగ్టి టిటిడబ్లుఆర్‌ఎస్ పాఠశాల విన్నర్‌గా నిలువగా తడ్కల్ పాఠశాల రన్నర్‌గా నిలిచింది. కబడ్డీ బాలికల విభాగంలో కంగ్టి కస్తూర్బా బాలికల పాఠశాల విజయం సాధించగా తడ్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రన్నర్‌గా నిలిచింది. ఖో-ఖో బాలుర విభాగంలో కంగ్టి విద్యార్తులు విన్నర్‌లుగా కంగ్టి లిటల్ స్టార్ పాఠశాల విద్యార్థులు రన్నర్‌లుగా, ఖోఖో బాలికల విభాగంలో కంగ్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్‌లుగా, తడ్కల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రన్నర్‌లుగా వాలీబాల్ బాలుర విభాగంలో తడ్కల్ విజేతగా, నాగూర్(బి) పాఠశాల రన్నర్‌గా, వాలీబాల్ బాలికల విభాగంలో కంగ్టిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల జట్లు విజేతగా, తడ్కల్ పాఠశాల రన్నర్‌గా నిలిచినట్లు అధికారులు పేర్కొన్నారు.